డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM
DYNAMIC JANAMVOICE

పైన ఉన్న క్యూ.ఆర్ కోడ్ ను స్కాన్ చేసి "జనం వాయిస్" దినపత్రిక ను చదవండి.

తెలంగాణ | సోమవారం | 28-09-2026 | సంపుటి: 01 | సంచిక : 260 | పేజీలు : 12

## చిట్టీల పేరుతో మోసం.

రూ. 10 కోట్లతో పరారైన ప్రభుత్వ టీచర్.
సూర్యాపేట జిల్లాలో ఘటన.
కుటుంబంలో కలిసి పరారు కావడంతో వెలుగులోకి.



2

## టీచర్ తో ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

సూరారం ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌పై ప్రిన్సిపల్ అసభ్య ప్రవర్తన.
'డ్రీమ్‌గర్ల్' అని ఫోన్‌లో నంబర్ సేవ్ చేసి వేధింపులు.
నిలదీసిన బాధితురాలి బంధువులపై కత్తితో దాడి.
ప్రిన్సిపల్‌తో పాటు కాలనీవాసులపైనా పోలీసుల కేసు నమోదు.

2




### సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

# ప్రశ్నల వర్షం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు ముందు కేటీఆర్ బహిరంగ లేఖ.
8 వేల ఎకరాల భూమి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్.
నేతన్నల బకాయిలు చెల్లించి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలని ప్రశ్న.
రైతు బంధు, రుణమాఫీ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరిన కేటీఆర్.
కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలని నిలదీత.

**జనం వాయిస్, సెప్టెంబర్ 27:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.

**8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం ఏది?**

అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే - మిగతా 2 లో...







### ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్'

## శాఖకు మినహాయింపు.

**విజయ్ సర్కార్ సంచలన నిర్ణయం.**

తమిళనాడులో కీలకమైన పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) విభాగానికి ఆర్టీఐ నుంచి మినహాయింపు.
ఇంటెలిజెన్స్, భద్రతా సంస్థగా వర్గీకరిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్.
సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఈ వివాదాస్పద నిర్ణయం తీసుకుంది.
మత ఘర్షణలు, కస్టడీ మరణాల సమాచారంపై ఇకపై గోప్యత.
ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) కింద మినహాయింపు ఉత్తర్వులు జారీ.

2

## శంషాబాద్ వద్ద హైవేపై కాలిబూడిదైన కారు.

సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్.
హైదరాబాద్-బెంగళూరు హైవేపై కారులో చెలరేగిన మంటలు.
అప్రమత్తమై వాహనం నుంచి బయటకు వచ్చిన డ్రైవర్.
చూస్తుండగానే పూర్తిగా కాలిబూడిదైన కారు.
షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని పోలీసుల అనుమానం.
ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసిన ఫైర్ సిబ్బంది.



2

## భారత రైల్వేలో కొత్త శకం.

దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలును ప్రారంభించిన అమిత్ షా

దేశంలో తొలిసారిగా పరుగులు తీసిన ఎల్ఎన్‌జీ రైలు.
సబర్మతిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా.
డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించే టెక్నాలజీ.
భారీగా ఆదా కానున్న ఇంధన ఖర్చు, తగ్గనున్న కాలుష్యం.
ఈ పర్యటనలో రూ.1542 కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం.

2




## 'ది ప్యారడైజ్' చూసిన కేటీఆర్

'ఆ డైలాగ్ చెప్పిందెవరో మీకు తెలుసుగా?' అంటూ ఇంట్రెస్టింగ్ ట్వీట్!
దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నటుడు నానిపై ప్రశంసల వర్షం.



2

## విజయవాడలో విషాద ఘటన.

ధర్నా విధుల్లో సీఐ అహ్మద్ అలీ హఠాన్మరణం
విజయవాడలో విధి నిర్వహణలో సీఐ అలీ మృతి.
బందోబస్తులో ఉండగా గుండెపోటుతో కుప్పకూలిన వైనం.



# భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి.

*పరీవాహక ప్రాంతాలకు హెచ్చరిక.*
*భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ప్రవాహం.*
*8-9 లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద.*
*ప్రభావిత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మోహరింపు.*
*ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాజ్‌వేలు దాటవద్దని హెచ్చరిక.*

2



డైనమిక్ జనంవాయిస్
PRGI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# చిట్టీల పేరుతో మోసం.

**జనం వాయిస్, సూర్యాపేట, సెప్టెంబర్ 27:**

చిట్టీల పేరుతో ప్రజల నుంచి రూ.10 కోట్లకు పైగా వసూలు చేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుటుంబం కలిసి పరారైన ఘటన సూర్యాపేట జిల్లాలో కలకలం రేపింది. బాధితులు శనివారం జిల్లా ఎస్పీ నరసింహను కలిసి ఫిర్యాదు చేయడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. చివ్వెంల మండలం ఏనేగండి తండాకు చెందిన ఓ వ్యక్తి, ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నాడు. సూర్యాపేటలోని విద్యానగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తూ, ఆరేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. తన సొంత తండాతో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు, బంధువులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వద్ద నమ్మకంగా ఉంటూ డబ్బులు కట్టించుకున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.1.30 కోట్ల వరకు వసూలు చేశాడు. కొందరికి ప్రామిసరీ నోట్లు రాసి ఇవ్వగా, మరికొందరికి నెలవారీగా అధిక లాభాలు ఇస్తానని నమ్మించాడు. ఇలా రూ.10 కోట్లకు పైగా సమీకరించాడు. అయితే, ఏడాదిగా డబ్బులు తిరిగి చెల్లించాలని బాధితులు ఒత్తిడి చేస్తుండటంతో వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే, పరారయ్యేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. తనకున్న 4 ఎకరాల భూమిలో ఎక్కువ భాగాన్ని ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించి, తన పేరిట కేవలం 13 గుంటలు మాత్రమే ఉంచుకున్నాడు. సుమారు పది రోజుల క్రితం, హైదరాబాద్‌లో ఓ ముఖ్యమైన వ్యక్తిని కలవాలని చెప్పి ఇద్దరు గ్రామస్థులను తనతో తీసుకెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో కూర్చుని తాను అప్పుల్లో కూరుకుపోయానని చెప్పి, ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు, సూర్యాపేట, తండాలోని అతడి ఇళ్లకు వెళ్లి చూడగా తాళాలు వేసి ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆ డబ్బును ఏం చేశాడనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# టీచర్ తో ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

**జనం వాయిస్, సూరారం, సెప్టెంబర్ 27:**

హైదరాబాద్‌లోని సూరారంలో ఒక దారుణ ఘటన వెలుగుచూసింది. ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ తన వద్ద పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఆ విషయాన్ని నిలదీసేందుకు వచ్చిన ఆమె బంధువులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. సూరారం సాయిబాబా నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్, అదే స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని కొంతకాలంగా మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్‌ను 'డ్రీమ్‌గర్ల్' అని సేవ్ చేసుకుని అసభ్యంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఈ వేధింపులను తట్టుకోలేక, అవమాన భారంతో సదరు ఉపాధ్యాయురాలు పాఠశాలకు వెళ్లడం మానేసింది. కుటుంబ సభ్యులు ఆరా తీయడంతో ఈ దారుణ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితురాలి సోదరుడు, స్థానికులు కలిసి పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం పెరగడంతో, ప్రిన్సిపాల్ వారిపై కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కత్తితో దాడికి పాల్పడిన ప్రిన్సిపాల్‌తో పాటు, పాఠశాల పై మూకుమ్మడిగా దాడికి యత్నించినందుకు కాలనీవాసులపై పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు మినహాయింపు.

**జనం వాయిస్, తమిళనాడు, సెప్టెంబర్ 27:**

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా వర్గీకరిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా G.O. Ms.No.57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ నిర్ణయం వల్ల... ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు. సాధారణంగా శాంతిభద్రతల విభాగం ప్రభుత్వ పరిపాలనలో అంతర్భాగం. దానిని ఒక గూఢచార సంస్థగా వర్గీకరించి ఆర్టీఐ నుంచి మినహాయించడం అనూహ్యమైన పరిణామం. ఈ చర్యతో పౌరులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు కీలకమైన సమాచారాన్ని తెలుసుకునే హక్కును కోల్పోతారు. ఇది ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుందని, అధికార దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం తమిళనాడులో తీవ్ర చర్చకు దారితీసింది.

# భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతి.

**జనం వాయిస్, భద్రాచలం, సెప్టెంబర్ 27:**

భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి 8 నుంచి 9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరింది. కూనవరం వద్ద 14.8 మీటర్లు, పోలవరం వద్ద 9.98 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5.61 లక్షల క్యూసెక్కులుగా కొనసాగుతోంది. వరద గరిష్ఠ స్థాయికి చేరిన అనంతరం క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. వరద ప్రభావిత జిల్లాల్లో అత్యవసర సహాయక చర్యల నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద ప్రమాదకర ప్రయాణాలు చేయవద్దని ఆయన ప్రజలను హెచ్చరించారు.



## సిరిసిల్ల వెళుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

# ప్రశ్నల వర్షం

- మొదటి పేజీ తరువాయి..

నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?**

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. "నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి" అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం



చేస్తున్నారని నిలదీశారు.

**రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది?**

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

**అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం**

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# శంషాబాద్ వద్ద హైవేపై కాలిబూడిదైన కారు.

**జనం వాయిస్, శంషాబాద్, సెప్టెంబర్ 27:**

శంషాబాద్ సమీపంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రయాణిస్తున్న ఓ కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే, కారు మాత్రం పూర్తిగా కాలి బూడిదైంది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారులో శంషాబాద్ వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంజిన్ భాగం నుంచి పొగలు రావడాన్ని డ్రైవర్ వెంటనే గమనించాడు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా కారును రోడ్డు పక్కకు ఆపి, వాహనం నుంచి కిందకు దిగిపోయాడు. కొన్ని క్షణాల్లోనే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడి కారును పూర్తిగా చుట్టుముట్టాయి. రహదారిపై వెళుతున్న ఇతర ప్రయాణికులు ఈ ఘటనను చూసి భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, వారు వచ్చేసరికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఇంజిన్ వేడెక్కడం లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

# భారత రైల్వేలో కొత్త శకం.







**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 27:**

భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ (డీపీసీ) ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ.11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది. ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ.1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ.700 కోట్లతో నిర్మించిన ఔూ+-12 లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

# 'ది ప్యారడైజ్' చూసిన కేటీఆర్



**జనం వాయిస్, సెప్టెంబర్ 27:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాని హీరోగా వచ్చిన 'ది ప్యారడైజ్' సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్‌లో పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించిన ఆయన, సినిమాలోని ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ను ప్రస్తావిస్తూ 'అదే ఎవరో మీకు తెలుసు' అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినిమా చూసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు అభినందనలు తెలిపారు. అస్తిత్వం కోసం ఆరాటం, అణిచివేతపై పోరాటాన్ని సినిమాలో బలంగా చూపించారని ప్రశంసించారు. హీరో నాని తన మిత్రుడని, కథానాయకుడి పాత్రలో జీవించారని కొనియాడారు. సందర్భం వచ్చినప్పుడు గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారతాయనే సందేశం బాగుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను పోలిన పాత్రలో నటించిన ప్రియదర్శికి కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'చావు నోట్లో తల పెట్టయినా... మీకు గుర్తింపు తెస్తా!!' అనే డైలాగ్‌ను గుర్తుచేస్తూ.. 'ఆ డైలాగ్ చెప్పింది ఎవరో మీకు తెలుసు కదా' అని వ్యాఖ్యానించారు. నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' చిత్రం అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నేపథ్యంలో రూపొందింది. సినిమాలో మాజీ సీఎం కేసీఆర్‌ను పోలిన పాత్ర ఉండటంతో విడుదలకు ముందే బీఆర్ఎస్ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే.

# విజయవాడలో విషాద ఘటన.

*ధర్నా విధుల్లో సీఐ అహ్మద్ అలీ హఠాన్మరణం*
*విజయవాడలో విధి నిర్వహణలో సీఐ అలీ మృతి.*
*బందోబస్తులో ఉండగా గుండెపోటుతో కుప్పకూలిన వైనం.*
*ఆసుపత్రికి తరలించినా ఫలితం దక్కని వైనం.*
*సీఐ మృతితో పోలీసు శాఖలో తీవ్ర విషాదం.*
*కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కన్నీరుమున్నీరు.*

**జనం వాయిస్, సెప్టెంబర్ 27:**



విజయవాడ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. నున్న పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పనిచేస్తున్న అహ్మద్ అలీ, విధుల్లో ఉండగానే తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం సచివాలయ ఉద్యోగులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో విజయవాడ వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీఐ అహ్మద్ అలీ తన సిబ్బందితో కలిసి గాంధీ నగర్‌లోని ధర్నా చౌక్ వద్ద విధుల్లో పాల్గొన్నారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ, చురుకుగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయనకు హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన సహచర సిబ్బంది, ఇతర అధికారులు ఆయనను హుటాహుటిన విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్ కు తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు ఆయనకు తక్షణ చికిత్స అందించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స ఫలించక తుదిశ్వాస విడిచారు. విధి నిర్వహణలోనే ఒక సమర్థుడైన అధికారి ప్రాణాలు కోల్పోవడం పోలీసు వర్గాలను తీవ్రంగా కలిచివేసింది. సీఐ అలీ మరణవార్త తెలియగానే ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనతో కలిసి పనిచేసిన సహచర అధికారులు, సిబ్బంది ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి పట్ల పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. నిత్యం విధులకు అంకితభావంతో పనిచేసే అధికారిని కోల్పోయామని సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థిని పైపుతో కొట్టిన కరస్పాండెంట్.

## గోదావరిఖని ఉషోదయ స్కూల్‌లో కలకలం..

- విద్యార్థి శరీరంపై ఎర్రటి వాతలు.
- తప్పు చేశాడన్న ఆరోపణలతో విచారణ..
- తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థి
- 'తప్పు చేస్తే తల్లిదండ్రులకు చెప్పాలి.. ఇలా కొట్టడం ఏమిటి?' అని స్థానికుల ఆగ్రహం.

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 27:**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ స్కూల్‌లో విద్యార్థిపై కరస్పాండెంట్ దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నాగేంద్ర అనే విద్యార్థిని ప్లాస్టిక్ పైపుతో కొట్టడంతో గాయాలయ్యాయని విద్యార్థి, అతని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి శరీరంపై ఎర్రటి వాతలు, కాలికి





వాపు ఉన్నట్లు వారు తెలిపారు.

### అసలేం జరిగింది?

విద్యార్థి నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక నిమజ్జనం సందర్భంగా పాఠశాలలో పులిహోర వంట చేసేందుకు కట్టెలను ఆవరణలో ఉంచారు. ఆ కట్టెలపై మూత్ర విసర్జన చేశాడన్న కారణంతో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తనను కొట్టారని విద్యార్థి ఆరోపించాడు. ఇదే సమయంలో పాఠశాలలోని మరో విద్యార్థిని బ్యాగులో నుంచి డబ్బులు కనిపించకుండా పోయిన ఘటనపై నాగేంద్రతో పాటు మరో విద్యార్థి రాహుల్‌పై సహచర విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఇద్దరు విద్యార్థులను కరస్పాండెంట్ విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని నాగేంద్ర చెప్పినప్పటికీ కరస్పాండెంట్ వినకుండా బెదిరించడంతో పాటు అక్కడే ఉన్న ప్లాస్టిక్ పైపుతో కొట్టారని విద్యార్థి మీడియాకు తెలిపాడు.

### 'నన్నే ఎక్కువగా కొట్టారు'

విద్యార్థి నాగేంద్ర మాట్లాడుతూ.. మరో విద్యార్థిని కూడా రెండు మూడు దెబ్బలు కొట్టారని, తనను మాత్రం ఎక్కువగా పైపుతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తొడ భాగంలో ఎర్రటి వాతలు ఉన్నాయని, మోకాలి కింద వెనుక భాగంలో కాలు వాపు వచ్చిందని, నడవడానికి ఇబ్బందిగా ఉందని తెలిపాడు.

### ఇది రెండోసారి అంటున్న తల్లిదండ్రులు

తమ కుమారుడిపై ఇదే పాఠశాలలో గతంలోనూ ఇలాంటి దాడి జరిగిందని నాగేంద్ర తల్లిదండ్రులు ఆరోపించారు. గతంలో కొట్టడంతో తమ కుమారుడి చేతికి ఫ్యాక్చర్ కూడా అయ్యిందని వారు పేర్కొన్నారు. తాజాగా మరోసారి దాడి జరగడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### తప్పు చేస్తే తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయాల్సిందే కదా?

విద్యార్థులు తప్పు చేస్తే పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్థానికులు అంటున్నారు. అంతేగానీ విద్యార్థులను భౌతికంగా శిక్షించడం సరైన పద్ధతి కాదని వారు చర్చించుకుంటున్నారు. చిన్నారులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# లక్ష్మీనగర్‌లో మన్ కీ బాత్ 138వ ఎపిసోడ్ వీక్షణ

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 27:**

రామగుండం నియోజకవర్గంలోని లక్ష్మీనగర్ మండలం 87వ బూత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్‌ను బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణితో పాటు పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించిన వివిధ అంశాలను నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ప్రజలకు సంబంధించిన అంశాలు, దేశ అభివృద్ధి, సమాజంలో ప్రజల భాగస్వామ్యంపై ప్రధాని చేసిన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. ఈ కార్యక్రమంలో మన్ కీ బాత్ కన్వీనర్ మాచా విశ్వాస్, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరకొండ అపర్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుల్వ లక్ష్మీనర్సయ్య, తాడగొండ నర్సయ్య, ఎల్తూరి సరిత రాజయ్య, శ్రీనివాస్ యాదవ్, బొంగ మహేష్, జక్కుల ప్రవీణ్, బియ్యాల మహేందర్, అరుకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

**జనం వాయిస్, రామగుండం, సెప్టెంబర్ 27:**

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ దేశానికి, తెలంగాణకు



అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు అలుపెరగని కృషి చేశారని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. 1915 సెప్టెంబర్ 27న ప్రస్తుత కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో జన్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ 1952లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం 1967, 1972లో భువనగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. 1957 నుంచి 1960 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా సేవలందించారని వివరించారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని సీపీ పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇందిరాపార్క్ వద్ద సత్యాగ్రహ దీక్షతో పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా సత్యాగ్రహం నిర్వహించారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, త్యాగం, నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశసేవ, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఆర్ఐ మల్లేశం, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాలకు

# సొంత భవనం మంజూరు చేయాలి.

**కేటాయించిన భూమిని రక్షించాలి. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు కు వినతిపత్రం అందజేత.**

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 27:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల పెద్దపల్లి ఏ టు సుల్తానాబాద్ కు వసతి గృహం భవనం మంజూరు చేయాలని కోరుతూ తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు గారికి శివ పల్లి లోని తన నివాసంలో ఆదివారం ఉదయం కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. 2017 లోని వసతి గృహానికి సంబంధించిన భూమి సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ లో అప్పటి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గా



ఉన్న ప్రభాకర్ రెడ్డి గారు భూమిని కేటాయించడం జరిగిందని, కానీ భూమి కేటాయించినప్పటికీ సొంత భవనం మంజూరు కావడంలేదని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సొంత భవనం మంజూరు కాకపోవడం వల్ల దానికి కటాయించిన భూమి అన్యక్రాంతం అవుతుందని తెలపడం జరిగింది. సొంత భవనం లేకపోవడం వల్ల ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనంలో అనేక సమస్యలు ఉండడం, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గారికి తెలియజేయడం జరిగింది. ముందుగా ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే గారు ఇటీవల మంత్రి హోదా రావడం పై మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే గారు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వసతి గృహ భవనం మంజూరు చేయాలని అదేవిధంగా అన్యక్రాంతమైన భూమిని రక్షించాలని ఎమ్మెల్యే గారిని కోరడం జరిగింది. అందుకు స్పందించిన ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే గారు ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి భవనం మంజూరు చేసేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బందెల రాజశేఖర్, వైస్ చైర్మన్ లంక దాసరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి గుండేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





**ఆరుతడి పంటలపై రైతులు దృష్టి పెట్టాలి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు.**

**జనం వాయిస్, పెద్దపల్లి , సెప్టెంబర్ 27:**

రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్లో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సమా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 137వ సర్వసభ్య సమావేశానికి విజయరమణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందించారు. ముందుగా టీవీ9, సిటీ కేబుల్ పాత్రికేయుడు టీకే రమేష్ మృతికి సంతాపం ప్రకటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. వాతావరణంపై సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున వర్షపాతం పరిస్థితులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల అవసరాల మేరకు రెండు తడులకు ఎస్సారెస్పీ నీటిని అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

### ధరణిపై బీఆర్ఎస్‌పై విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో భూదోపిడీ జరిగిందని విజయరమణారావు ఆరోపించారు. ధరణి వ్యవస్థతో కేసీఆర్ కుటుంబానికే మేలు జరిగిందని, పేదల భూములు గల్లంతయ్యాయని ఆయన విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. 22ఏ భూముల అంశంపై గతంలో రాద్ధాంతం చేసిన బీఆర్ఎస్ నేతలు, ప్రస్తుతం వారి ఆస్తుల వివరాలు బయటకు వస్తున్న సమయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బినామీ పేర్లతో కేసీఆర్ కుటుంబానికి ఇంకా ఎన్ని వేల కోట్ల ఆస్తులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని ఆరోపించారు. 22ఏ పరిధిలో 3.76 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నాయని, కోటి



ఎకరాలంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విజయరమణారావు ఆరోపించారు.

### కాళేశ్వరం నీటిపై సవాల్

కాళేశ్వరం ప్రాజెక్టు నీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క కూడా రాలేదని విజయరమణారావు పేర్కొన్నారు. కాళేశ్వరం నీరు వచ్చినట్లు నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు. అనంతరం ఎలిగేడు మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి తరానికి ఆదర్శం

## సాదుల పవన్ కుమార్

**జనం వాయిస్,నంగునూరు, సెప్టెంబర్ 27**

నంగునూర్ మండల కేంద్రంలో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నాయకులు, పద్మశాలి సమాజ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రాంతానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశ సేవ చేసిన ఆయన.. అనంతరం తెలంగాణ ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దాసరి రామలింగం, సాదుల చంద్రశేఖర్, దాసరి రవి, కారపురి శ్రీనివాస్, బింగి రవీందర్, బొజ్జ మహేష్, ఆనందాస్ విష్ణుమూర్తి, దాసరి మల్లేశం, కారంపూరి రామచంద్రం, ఆరగొండ శశి, పోతన వినోద్, దికొండ భాను, దాసరి వినయ్, దాసరి శేఖర్, వేముల ప్రశాంత్, గాజర్ల సిద్ధు, దాసరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ సాధనకు కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరగని పోరాటం.

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 27:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు. ఆయన జయంతి వేడుకలను ఆదివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ జ్యోతి ప్రజ్వలన చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. మాటలకే పరిమితం కాకుండా 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసి తన త్యాగాన్ని చాటుకున్నారని




తెలిపారు. సామాజిక అభ్యున్నతికి కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని రవీందర్ పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శాసన సభ్యుడిగా సేవలందించారని, తెలంగాణ మలిదశ ఉద్యమానికి కూడా తనవంతు సహకారం అందించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన మహనీయుల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిందని తెలిపారు. ఆయన ఆశయాలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలవాలని, ఆయన చేసిన సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకున్నారు. జిల్లా అధికారులు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పద్మశాలి, బీసీ కుల బాంధవులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి హనుమకొండలో

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ పురస్కారం

**జనం వాయిస్, ఖమ్మం, సెప్టెంబర్ 27:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఆదివారం నాడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ పురస్కారం లభించింది. శ్రీ విరాట్ విశ్వకర్మ ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ వారు దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ అవార్డును ఎంపిక చేయడం జరిగింది. ఈ అవార్డును దివ్యమూర్తి హనుమకొండలోని జయకృష్ణ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్ఎస్ నంద మరియు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. తదనంతరం దివ్యమూర్తిని ప్రముఖ హాస్య నటులు ఆర్ఎస్ నంద మరియు ఇతర ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం మరియు సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 83 అవార్డులు వచ్చాయని 147 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలోజు రాజ్ కుమార్ , వనపర్తి పద్మావతి, వంగాల శాంతి కృష్ణ ఆచార్య, దివ్యమూర్తి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.






## గ్రామ దేవాలయ అర్చకులకు శిక్షణ తరగతులు ప్రారంభం

### గ్రామ దేవాలయ అర్చకులకు శిక్షణ తరగతులు



**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 27:**

గ్రామీణ ప్రాంతాల్లో హిందూ ధర్మం, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా ధర్మ జాగరణ తెలంగాణ, మంచిర్యాల జిల్లా గ్రామ దేవాలయ అర్చక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అర్చక శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మందమర్రి మార్కెట్ సమీపంలోని శ్రీ హరిహర అయ్యప్ప దేవాలయంలో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 3 వరకు వారం రోజులపాటు శిక్షణ కొనసాగనుంది. ఆగమ శాస్త్రోక్త పూజా విధానాలు, మంత్రోచ్చారణలు, ధూప, దీప, నైవేద్య నిర్వహణ, ప్రాచీన సంప్రదాయాలపై అర్చకులకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో దేవస్థాన గౌరవ అధ్యక్షుడు బర్ల సదానందం, కోశాధికారి కొమ్ము రాజేష్, వాల్సా సదానందం, ధర్మ జాగరణ ప్రతినిధులు, అర్చక పరిషత్ బాధ్యులు, వివిధ గ్రామాల అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## బాపూజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం

- తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలిన త్యాగశీలి.
- వంగర సాంబయ్య, దిడ్డి రమేష్.



**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 27:**

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య అన్నారు. ఆదివారం శాయంపేటలో బాపూజీ 111వ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, సామాజికవేత్తగా బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

**బీసీల హక్కుల కోసం పోరాటం**

తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని సైతం త్యజించిన నిబద్ధతగల నాయకుడు బాపూజీ అని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్ అన్నారు. బీసీల హక్కులు, అభివృద్ధి, రాజకీయాధికారం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బాసని సాయి, వడ్డేపల్లి శ్రీను, దిడ్డి ప్రభాకర్, గోరంటల ప్రశాంత్, చిందం సాయి, బాసని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## " చలో " యాదగిరిగుట్టకు కదిలిన ఉద్యమకారులు..

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 27:**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్టలో నిర్వహించే సభకు శాయంపేట మండల ఉద్యమకారులు ఆదివారం తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో శాయంపేటలో ప్రత్యేకంగా సమావేశమై, జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్‌తో కలిసి ఉద్యమకారులు యాదగిరిగుట్టకు బయలుదేరారు. ఉద్యమకారుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని గణేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దమారి సురేష్,పల్లెబోయిన సారయ్య,తుడుం వెంకటేష్,ఎండి రఫీ,దుంపల మహేందర్ రెడ్డి తుమ్మ ప్రభాకర్,చల్ల శ్రీనివాస్ రెడ్డి,చల్ల రాజిరెడ్డి, మేకల శ్రీనివాస్,అరిళ్ల విజయ్,ఎండి రాజ్ మహమ్మద్, మెరగుత్తి కరుణాకర్,రంగు మహేందర్,దూదిపాల జోగిరెడ్డి,ఎర్ర తిరుపతిరెడ్డి,చిందం ప్రభాకర్, ఎండి ఉస్మాన్, కొడపాక బాబు, కొడిమాల సంతోష్, కుక్కల గణేష్ తడక కుమారస్వామి, పైండ్ల చంద్రమౌళి, నంద సురేష్, చిట్టి రమేష్,చెక్క రామ్మూర్తి, పల్లెబోయిన శ్రీనివాస్, చెక్క రఘుపతి,చల్ల సంజీవరెడ్డి,దూదిపాల రాజిరెడ్డి, సొంటిరెడ్డి శంకర్ రెడ్డి,గొర్రె కుమారస్వామి, రేణుకుంట్ల సుమన్ పాల్గొన్నారు.

## 100 పడకల ఆస్పత్రిలో దివ్యాంగులకు ఉద్యోగాలు కల్పించాలి

- హామీల మేరకు కేటగిరీల వారీగా నియామకాలు చేపట్టాలి.
- రాజోజు జ్యోతి.



**జనం వాయిస్, పరకాల, సెప్టెంబరు 27:**

పరకాల పట్టణంలో ఇటీవల ప్రారంభించిన 100 పడకల ఆస్పత్రిలో దివ్యాంగులకు వారి కేటగిరీల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని తల్లి దివ్యాంగుల సేవా సమితి పరకాల ఇన్‌చార్జి రాజోజు జ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల ప్రజావాణిలో తల్లి దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించినట్లు ఆమె తెలిపారు. ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీల మేరకు వారి కేటగిరీల ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే దివ్యాంగులంతా ఏకమై తల్లి దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# పితృ పక్షాలు-పూర్వీకులను స్మరించే ఆచారం.

భారతీయ సంస్కృతిలో పితృ పక్షాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భాద్రపద మాసంలోని కృష్ణ పక్షాన్ని సాధారణంగా పితృ పక్షం లేదా మహాలయ పక్షంగా పరిగణిస్తారు. ఈ సంవత్సరం 27 సెప్టెంబర్ ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ కాలంలో మరణించిన తల్లిదండ్రులు, తాతముత్తాతలు, ఇతర పూర్వీకులను స్మరించుకుంటూ తర్పణాలు, పిండప్రదానాలు, శ్రాద్ధకర్మలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే పితృ పక్షం కేవలం ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాదు. తమ ఉనికికి కారణమైన పూర్వీకుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే సంస్కృతి కూడా. హిందూ ధర్మగ్రంథాల్లో పితృదేవతలకు విశిష్టమైన స్థానం ఇచ్చారు. గరుడ పురాణం, మత్స్య పురాణం, అగ్ని పురాణం, వాయు పురాణం వంటి గ్రంథాల్లో శ్రాద్ధం, తర్పణం, పితృకర్మలకు సంబంధించిన విషయాలు ప్రస్తావించబడ్డాయి. పితృదేవతలను స్మరించడం ద్వారా కుటుంబంలో ధర్మబద్ధమైన జీవనం, కృతజ్ఞతా భావం కొనసాగుతుందని సంప్రదాయ విశ్వాసం. గరుడ పురాణంలో మరణానంతర జీవితం, పితృకర్మలు, శ్రాద్ధ విధానాల గురించి విస్తృతంగా వివరణ కనిపిస్తుంది. మరణించినవారి పట్ల కుటుంబ సభ్యులు నిర్వహించే కర్మలు వారి ఆత్మశాంతికి సంబంధించిన ధార్మిక సంప్రదాయంగా వివరించబడ్డాయి. అయితే వీటిని కేవలం భయంతో కాకుండా ధర్మం, కర్తవ్యబోధ, పూర్వీకుల పట్ల గౌరవంతో చూడాలనే భావన ముఖ్యమైనది. పితృ పక్షానికి సంబంధించిన అత్యంత ప్రసిద్ధ కథల్లో మహాభారతంలోని కర్ణుడి కథ ఒకటి. కర్ణుడు జీవితకాలంలో విస్తారంగా దానధర్మాలు చేశాడని, అయితే పూర్వీకుల కోసం అన్నదానం లేదా పిండప్రదానం చేయలేదనే కథనం మహాభారత సంప్రదాయంలో కనిపిస్తుంది. మరణానంతరం పితృలోకానికి చేరినప్పుడు తనకు ఆహారంగా బంగారం లభించిందని, దాంతో కారణం తెలుసుకున్న కర్ణుడికి పూర్వీకుల కోసం అన్నదానం చేయాల్సిన ప్రాధాన్యత అర్థమైందని కథ చెబుతుంది. తరువాత కర్ణుడికి భూమిపైకి వచ్చి తన పూర్వీకుల కోసం శ్రాద్ధం, దానం చేయడానికి అవకాశం లభించిందని



పురాణ సంప్రదాయం చెబుతుంది. ఈ కథలోని ప్రధాన సందేశం---సంపదను దానం చేయడం మాత్రమే కాదు, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, పూర్వీకులను స్మరించడం కూడా ధర్మంలో భాగమే అన్నది. రామాయణ సంప్రదాయంలో కూడా తండ్రి దశరథుడి మరణం తరువాత శ్రీరాముడు, లక్ష్మణుడు, భరతుడు తదితరులు నిర్వహించిన అంత్యక్రియలు, పితృకర్మలకు ప్రాధాన్యత కనిపిస్తుంది. పుత్రధర్మం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, పూర్వీకుల పట్ల గౌరవం వంటి విలువలు భారతీయ ఇతిహాసాల్లో పదేపదే ప్రతిఫలిస్తాయి. అందువల్ల పితృ పక్షం మనకు చెప్పే సందేశం కేవలం మరణించినవారిని స్మరించుకోవడం మాత్రమే కాదు. తల్లిదండ్రుల పట్ల జీవించి ఉన్నప్పుడే మన బాధ్యతలను నిర్వర్తించాలి అనే విలువను కూడా గుర్తుచేస్తుంది. 'తర్పణం' అనే పదానికి తృప్తిపరచడం, సంతృప్తి కలిగించడం అనే భావం ఉంది. నీటిని సమర్పిస్తూ పూర్వీకులను స్మరించడం వెనుక ఉన్న ఆధ్యాత్మిక విశ్వాసాలు భిన్నంగా ఉండవచ్చు. మన గత తరాలను మర్చిపోకూడదని తర్పణం యొక్క ముఖ్య ఉద్దేశం. కాలం మారుతున్న కొద్దీ కొన్ని ఆచారాలు ఆర్భాటంగా మారుతున్నాయి. పూర్వీకుల పేరుతో అధిక ఖర్చులు చేయడం కంటే పేదలకు అన్నదానం చేయడం, వృద్ధులకు సహాయం చేయడం, అనాథలకు చేయూతనివ్వడం వలన కూడ పితృ దేవతలను సంతృప్తిపరచవచ్చు. వీటి వలన ప్రజల్లో దాన గుణం పెరుగుతుంది. పితృ పక్షంలో పూర్వీకుల చిత్రాలకు పూలు వేసి నివాళులు అర్పిస్తూ, జీవించి ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. వృద్ధ తల్లిదండ్రుల ఆరోగ్యం, అవసరాలు, ఆత్మగౌరవం, భావోద్వేగాలను గౌరవించడం నిజమైన పితృభక్తి. పురాణాలు, ఇతిహాసాలు పితృకర్మలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించినప్పటికీ, వాటి వెనుక ఉన్న మానవీయ సందేశం నేటికీ ప్రాసంగికమే. మన మూలాలను మర్చిపోకూడదు. తల్లిదండ్రులను గౌరవించాలి. వృద్ధులను ఆదుకోవాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలి. అవసరమైన వారికి సహాయం చేయాలి. కుటుంబ విలువలను తదుపరి తరాలకు అందించాలి.



ఆళవందార్ వేణు మాధవ్
8686051752, హైదరాబాద్

## కళారూపాలతో మత్తు పదార్థాలపై చైతన్యం.

- యువత మత్తు జోలికి వెళ్లొద్దు: ఎస్సై జక్కుల పరమేష్.

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 26:**

మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో చైతన్యం కల్పించేందుకు జాగృతి పోలీస్ కళాబృందం కళారూపాలను వేదికగా చేసుకుంది. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత(ఐపీఎస్)ఆదేశాల మేరకు శాయంపేట మండలం పెద్దకోడేపాకలో శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జక్కుల పరమేష్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, గుట్కాకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయం, వినియోగంపై 1908కు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, సైబర్ నేరాలు, డయల్ 112, సీసీటీవీ కెమెరాలు, గుడుంబా నిర్మూలన తదితర అంశాలపై కళాబృందం పాటలు, 'వెలుగుబాట' నాటిక, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించింది. 1930 సైబర్ హెల్ప్‌లైన్‌పై వివరించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంద దీన-ప్రభాకర్, మహిళా ఏఎస్సై నాగమణి, పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా

**సమీక్షలు పెట్టడం కాదుపాలకుర్తి గురుకుల.**
**పాఠశాలలో విద్యార్థుల సమస్యలపై స్పందించండి.**
**విద్యార్థుల భద్రతపై ధర్నా చేస్తే విమర్శిండం సిగ్గు చేటు.**

**పాలకుర్తి సెప్టెంబర్ 27 జనం వాయిస్:**

పాలకుర్తి మండల కేంద్రంలోని బి.ఆర్.ఎస్.పార్టీ ఆఫీస్ లో పసునూరి నవీన్ కుమార్ పాలకుర్తి మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనగామ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు మరియు బానోత్ మహేందర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ పాలకుర్తి మండల కేంద్రంలోని ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో మన ఊర -మన బడి పేరుతో నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసిన ఘనత దయాకర్ రావు గారిది. పాలకుర్తి మండలంలో ఉన్న, కస్తూర్బ గాంధీ మరియు గూడూరు లో ఉన్న ట్రైబెల్ వెల్ఫేర్ పాఠశాలకు నిధులు మంజూరు చేయించి నూతన భవనాలను నిర్మించిన ఘనత దయాకర్ రావు గారిది పాలకుర్తి మండల కేంద్రానికి జ్యోతి రావ్ పూలె ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి దయాకర్ రావు నిధులు మంజూరు చేయిస్తే అట్టి ప్రభుత్వం పాఠశాలను పాలకుర్తి నుండి తొర్రూర్ కు మార్చిన ఘనత ఎమ్మెల్యే గారిది పాలకుర్తి మండల కేంద్రంలోని ఉచిత తరగుతుల శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం ఉద్యోగులను చేసిన ఘనత దయాకర్ రావు గారిది. జాబ్ మేళా ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు ప్రయివేట్ రంగాలలో ఉద్యోగాలను ఇపించిన ఘనత దయాకర్ రావు ది ఎర్రబెల్లి దయాకర్ రావు ధర్నా చేసింది కుర్చీ కోసం కాదు విద్యార్థినుల భద్రత కోసం ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలి. ఆడబిడ్డల భద్రతపై ధర్నా చేసిన ఎర్రబెల్లిని విమర్శించే ముందు అసలు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో కాంగ్రెస్ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లోబొబ్బల అశోక్ రెడ్డి కమ్మగాని విజయ-నాగన్న గౌడ్ పాలకుర్తి మేజర్ సర్పంచ్ మాచర్ల ఎల్లయ్య పాలకుర్తి మండల ప్రధాన కార్యదర్శి వీరమనేని సోమేశ్వర్ రావు దొంతమల్ల గణేష్ లకావత్ నాగరాజు నాయక్ కత్తి సైదులు లకావత్ వెంకట్ నాయక్ పసుల వెంకటేష్ కోలా నారాయణ బీరెల్లి రవి వర్మ రాజ్ మహమ్మద్ ఇంతలా కృష్ణమూర్తి నాయకులు పాల్గొన్నారు.



## త్యాగం.. పోరాటం.. సేవకు ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ

### పాలకుర్తీ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**సెప్టెంబర్ 27 జనం వాయిస్ పాలకుర్తి:**

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పాలకుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన స్థలంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్ పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశ సేవ చేసిన బాపూజీ, అనంతరం తెలంగాణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. పాలకుర్తి మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు మాచర్ల సారయ్య, గూడూరు చేనేత సహకార సొసైటీ మాజీ చైర్మన్ రచ్చ కృష్ణమూర్తి, పోపా జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశలోనే బాపూజీ కీలక పాత్ర పోషించారని, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించిన నాయకుల్లో ఆయన ఒకరని పేర్కొన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో బాపూజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా ఆయన సేవలను, త్యాగాలను భవిష్యత్ తరాలకు గుర్తు చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షులు పెనుగొండ వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిలుకమారి వెంకటేశ్వర్లు, చిదురాల మార్కండేయ, విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలకమారి సోమేశ్వర్ (బన్నీ), వార్డ్ సభ్యుడు కామారపు సునీల్, కాంగ్రెస్ పార్టీ ఒబిసి రాష్ట్ర కోఆర్డినేటర్ పులి గణేష్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ ఎడవెల్లి సోమమల్లయ్య, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్బాస్ అలీ, గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, కవి మన్యపు భూజేందర్,మాజీ ఎంపీపీ యాకసోమయ్య, మాజీ ఉప సర్పంచ్ కాటబత్తిని రమేష్, ఉపాధ్యక్షులు ఈగ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు చిలుకమారి శ్రీధర్, ఎనగందుల శ్రీనివాస్, శ్రీధర్ పెనుగొండ సోమశేఖర్, సతీష్, చిలుకమారి వెంకటేష్, ప్రభాకర్, సందీప్, పొన్నాల వీరయ్య, కూరపాటి రాజు, అభిలాష్, కమిటీ సభ్యులు,వివిధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులర్పించారు.



## అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డి రాజుల రమేష్‌ను పరామర్శించిన దావెరా అనిల్ కుమార్



**సెప్టెంబర్ 27 జన వాయిస్ పాలకుర్తి:**

దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాజుల రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు, దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దావెరా అనిల్ కుమార్ రమేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య సజ్జన్, మాసంపల్లి మహేందర్, యూత్ అధ్యక్షులు పులిగిల్ల వెంకన్న, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు ఉప్పుల ప్రకాష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.